

పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారిగా సదానందం

వికారాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా డాక్టర్ వి.సదానందం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నెల రోజుల కిందట వికారాబాద్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆయన సాధారణ బదిలీల్లో నల్లగొండ జిల్లాకు వెళ్లారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో డిప్యూటీ డైరెక్టర్‌గా ప్రమోషన్ లభించింది. మంగళవారం జారీ అయిన ఉత్తర్వుల్లో వికారాబాద్ జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా నియమించారు.

జంట జలాశయాల్లో ఫామ్‌హౌస్‌లు!

ఆక్రమణలకు గురైన గండిపేట చెరువు, హిమాయత్ సాగర్


హిమాయత్ సాగర్ బఫర్‌జోన్ పరిధిలో ఉన్న ఫాంహౌస్

శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల పరిధిలోని జంట జలయాశయాలైన గండిపేట చెరువు, హిమాయత్ సాగర్ చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఇష్టారాజ్యంగా ఫామ్‌హౌస్‌లు, వ్యవసాయ క్షేత్రాలు దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతం నగరానికి కూతవేటు దూరంలో ఉండడంతో శ్రీమంతులు, రాజకీయ నాయకులు, ఇతర రంగాల ప్రముఖులు పదుల సంఖ్యలో ఫామ్‌హౌస్‌లను నిర్మించుకున్నారు. అయితే, ఈ నిర్మాణాల్లో చాలా వరకు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించినట్లు ప్రచారం సాగుతోంది. కాగా, ఆయా వివరాలను ఇరిగేషన్ శాఖ అధికారులు ఇప్పటికే 'హైడ్రా'కు అందించినట్లు సమాచారం. దీంతో హైడ్రా అధికారులు ఆ అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

- నగరానికి సమీపంలో ఉండటంతో భారీగా నిర్మాణాలు
- గండిపేట పరిధిలో పలు నిర్మాణాలను కూల్చిన హైడ్రా
- మిగిలిన భవనాల యజమానుల్లో మొదలైన గుబులు
- పెద్దమంగళారం, తోల్‌కట్ట చెరువుల్లో భారీగా ఆక్రమణలు
- మాయమైన శంకర్‌పల్లి మండలంలోని మొండి వాగు

కబ్జాల పర్వం 12

చేవెళ్ల, సెప్టెంబరు 11: మొయినాబాద్ మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామం రెవెన్యూ పరిధిలోని పలువురు వీఐపీలకు చెందిన ఫామ్‌హౌస్‌లను ఇప్పటికే హైడ్రా కూల్చివేసిన సంగతి తెలిసిందే. గండిపేట్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కూల్చాల్సిన వ్యవసాయ క్షేత్రాలు, ఫామ్‌హౌస్‌లు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. కేంద్ర మాజీ మంత్రికి చెందిన వ్యవసాయ క్షేత్రాలు చిలుకూరు గ్రామం పరిధిలో ఉన్నాయి. అలాగే ఓ పారిశ్రామికవేత్తకు చెందిన ఫామ్‌హౌస్ గండిపేట్ జలాశయం బఫర్ జోన్‌లో నిర్మించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఓ కీలక నాయకుడికి సంబంధించిన ఫామ్‌హౌస్ సైతం అక్కడ ఉండటం గమనార్హం. దీంతో పాటు ఓ పాపులర్ విద్యాసంస్థల యజమానికి చెందిన ఫామ్‌హౌస్ అజీజ్‌నగర్ రెవెన్యూ పరిధిలో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలకు సంబంధించిన వారంతా హిమాయత్ సాగర్ పరిధిలోకి బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిని ఆక్రమించినట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. కాగా ఇప్పటికే హైడ్రా అధికారులకు నివేదిక ఇచ్చినట్లు సమాచారం. దీంతో ఆక్రమణదారుల్లో హైడ్రా గుబులు పట్టుకుంది. అధికారులు ఎప్పుడు వచ్చి కూల్చివేస్తారో అనే భయం వారిని వెంటాడుతోంది.

ఇనుప కంచె తొలగింపు

షాబాద్ మండల కేంద్రంలో పైల్వాన్ చెరువు, మండల పరిధిలోని చందన్‌వెల్లి చెరువు, సోలిపేట్, తాళ్లపల్లి, మాచన్‌పల్లి, పెద్దవేడు తదితర గ్రామాల్లో పెద్ద చెరువులు ఉన్నాయి. ఆ చెరువులు కబ్జాకు గురికాలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే పహిల్వాన్ చెరువు బఫర్‌జోన్ సమీపంలో నిబంధనల ప్రకారం భూమి కొనుగోలు చేసినప్పటికీ పొలం చుట్టు ఓ రాజకీయ నాయకుడి సోదరి ఇనుప కంచె ఏర్పాటు చేయించింది. అయితే అది బఫర్‌జోన్‌లో ఉండటంతో వెంటనే తొలగించాలని అధికారులు నోటీసులు అందజేశారు. దీంతో ఆమె స్వయంగా కూలీలతో తీసివేయించారు.


మీర్జాగూడ గ్రామంలో ఫంక్షన్‌హాల్ యజమాని మట్టి పోయడంతో కనుమరుగైన మొండివాగు


మొండివాగులో పోసిన మట్టి

మొయినాబాద్ మండలంలో..

మొయినాబాద్ మండలంలో మొత్తం 50 చెరువులు ఉన్నాయి. ఇందులో 20 చెరువుల వరకు ఆక్రమణకు గురైయ్యాయి. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న వ్యవసాయ క్షేత్రాల ప్రహరీ, రోడ్లు, ప్రీకాస్ట్ వాల్స్ ఒకటి రెండు చెరువుల్లో నిర్మాణాలు కూడా దర్శనమిస్తున్నాయి. అలాగే మండల పరిధిలోని పెద్దమంగళారం, తోల్‌కట్ట గ్రామ చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలోనూ అక్రమ నిర్మాణాలు ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

మొండివాగు మూసివేత

శంకర్‌పల్లి మండల పరిధిలోని జన్వాడ గ్రామంలోని పెద్ద చెరువులోకి నీళ్లు రాకుండా మిర్జాగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఫంక్షన్ హాల్ యజమాని మొండివాగులో వందలాది లారీల మట్టిపోసి వాగును మూసివేశాడు. ఈ వాగు పూర్తిగా కనుమరుగు కావడంతో పెద్ద చెరువులోకి నీళ్లు రావడం లేదు. అదేవిధంగా పెద్ద చెరువు - మొండివాగు మధ్య హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి సైతం ఈ వాగు నుంచి వచ్చే వర్షపు నీటి కోసం ఉన్న వాగును ఒకవైపు మూసివేశాడు. దీంతో పెద్ద చెరువులోకి వరద నీళ్లు రాకుండా ఆటంకం ఏర్పడింది. దీంతో ఆ చెరువులు పూర్తిగా నిండటం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జన్వాడ తుమ్మ సముద్రం చెరువులో ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన ఓ వ్యక్తి తన ఫామ్‌హౌస్‌లోకి వెళ్లేందుకు దర్జాగా అడ్డంగా రోడ్డును నిర్మించి గేట్‌ను ఏర్పాటు చేసుకున్నాడు.


పహిల్వాన్ చెరువు పరిధిలో కంచెను తొలగిస్తున్న కూలీలు

హైడ్రా దేగ కన్ను

- చెరువులు, కుంటలు, సర్కార్ స్థలాల పరిశీలన
- గుట్టుచప్పుడు కాకుండా పర్యటిస్తున్న బృందాలు
- సిబ్బంది పెంపుతో మరింత దూకుడు
- మూసీ, జంట జలాశయాలపై ప్రత్యేక దృష్టి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా దూకుడు పెంచుతోంది. నగర శివార్లలోని చెరువులు, కుంటలు, నాలాలతో పాటు ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను పరిశీలించేందుకు హైడ్రా బృందాలు ఫిర్యాదులు ఆధారంగా స్థల పరిశీలనలు చేస్తున్నాయి. ఇంతేకాక సుదీర్ఘకాలంగా కబ్జాలకు గురవుతున్న చెరువులు, కుంటలు, ఇతర జలాశయాలను పరిశీలించేందుకు గుట్టుచప్పుడు కాకుండా పర్యటిస్తున్నాయి. హైడ్రాను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అదనపు సిబ్బందిని కూడా నియమిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా 15 మంది సీఐలు, 8 మంది ఎస్‌ఐ స్థాయి అధికారులను ప్రభుత్వం నియమించింది. ఈ సంఖ్యను మరింత పెంచనున్నట్లు సమాచారం. అలాగే హైడ్రా కోసం ప్రత్యేక పోలీస్ స్టేషన్ వ్యవస్థను కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలపై వెనక్కి తగ్గేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ప్రకటించారు. కోర్టులకు వెళ్లినా కొట్లాడి మరీ అక్రమనిర్మాణాలను కూల్చివేస్తామని హెచ్చరించారు. ఇక మధ్య, పేద తరగతి వర్గాల వారికి నష్టం జరకుండా చూస్తామని హైడ్రా అధికారులు చెబుతున్నారు. నివాసం ఉండే ఇళ్ల జోలికి ఇప్పట్లో వెళ్లమని కూడా ప్రకటించారు. తెలిసో తెలియకో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఇళ్లు కొనుగోలు చేసిన వారికి ఇది కొంత ఊరట కలిగించే విషయం. దొడ్డిదారిన కొందరు బిల్డర్లు హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ అనుమతులు తీసుకుని నివాస సముదాయాలు నిర్మించి అమ్మేశారు. తొలుత హైడ్రా ఈ నిర్మాణాలను కూడా కూల్చివేసింది. దీంతో బాధితులతో పాటు కొన్నివర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో హైడ్రా వివరణ ఇచ్చింది.



ఇప్పటికే 112 ఎకరాలు స్వాధీనం

ఇదిలా ఉంటే ఇప్పటికే గ్రేటర్ పరిధిలో 23 ప్రాంతాల్లో 262 ఎకరాల్లోని అక్రమ నిర్మాణాలను కూల్చివేసి దాదాపు 112 ఎకరాలను స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా ప్రకటించింది. ఇందులో సింహభాగం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే ఉన్నాయి. మాదాపూర్ సున్నం చెరువులో 42, గగన్ పహాడ్ అప్పాచెరువులో 14, దుండిగల్ కత్వా చెరువు పరిధిలోని 13 అక్రమ నిర్మాణాలను తొలగించారు. సున్నం చెరువులో ఆక్రమణలు తొలగించి 10 ఎకరాలు, గండిపేటలో 8.75 ఎకరాలు, చిలుకూరులో 6.5 ఎకరాలు, కత్వా చెరువులో 2.5 ఎకరాలు, తుమ్మిడి కుంటలో 4.9 ఎకరాలు స్వాధీనం చేసుకున్నట్లు హైడ్రా వెల్లడించింది.

హిమాయత్‌సాగర్, మూసీపై దృష్టి

ప్రస్తుతం నగర శివార్లలోని జంట జలాశయాలైన గండిపేట(ఉస్మాన్‌సాగర్) హిమాయత్‌సాగర్ చెరువులతో పాటు మూసీ పరీవాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలపై ఎక్కువ దృష్టి పెడుతోంది. ఇప్పటికే గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన హైడ్రా అధికారులు ప్రస్తుతం హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతంతో పాటు మూసీపై దృష్టి సారించారు. హిమాయత్‌సాగర్, మూసీ పరివాహక ప్రాంతంలోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణాలు పరిశీలిస్తున్నారు. సంబంధిత అధికారులతో కలిసి రహస్యంగా సర్వేలు చేయించి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోజోన్ పరిధి గుర్తించి మార్కింగ్ చేస్తున్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ రెవెన్యూ పరిధిలో హైడ్రా అధికారులు ఇప్పటికే సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. మరో వైపు హైడ్రా కూల్చివేతలతో అప్రమత్తమైన కొంత మంది ముందుగానే స్వయంగా అక్రమణలు తొలగించుకుంటున్నారు. ఇందులో కొందరు ప్రముఖులు కూడా ఉండడం గమనార్హం. బఫర్‌జోన్ పరిధిలోని ప్రహరీ, షెడ్లు తొలగించి ఫెన్సింగ్ వేసుకుంటున్నారు. తొలగించిన శిథిలాలుకూడా అక్కడ లేకుండా జాగ్రత్త పడుతున్నారు. త్వరలో హిమాయత్‌సాగర్, మూసీ పరీవాహక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు భారీ ఆపరేషన్ ఉండవచ్చని తెలుస్తోంది.

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

కొడంగల్, సెప్టెంబరు 11: ఓటరు జాబితా సవరణకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ కోరారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో నాయకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా నియోజకవర్గంలో బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి పరిశీలన చేపట్టనున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేయడం, ఓటరు జాబితాలో సవరణలు చేయడం లాంటివి చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, రెవెన్యూ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ప్రజాపాలన దినోత్సవ అతిథి స్పీకర్ గడ్డం ప్రసాద్



వికారాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని 17వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించే పతాకావిష్కరణ కార్యక్రమానికి శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఆయన జాతీయ జెండా ఎగురవేసి ప్రసంగించనున్నారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపాలిటీలు, పంచాయతీలు, ఇతర స్థానిక సంస్థల కార్యాలయాల్లో కూడా జాతీయ జెండా ఎగురవేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో సూచించారు.

లక్ష్మీనారాయణ చెరువు కట్టకు బుంగ

- వృథాగా పోతున్న నీరు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 11 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు కట్టకు బుంగ పడింది. దాంతో చెరువులోని నీరంతా వృథాగా పోతోంది. గతేడాది కురిసిన భారీ వర్షాలకు చెరువు తూము వద్ద బుంగ పడి నీరు వెళ్లడంతో ఇరిగేషన్ అధికారులు ఇసుక బస్తాలతో మరమ్మతులు చేపట్టారు. చెరువు కట్టకు తిరిగి అదే ప్రాంతంలో బుంగ పడటంతో బుధవారం ఇరిగేషన్ ఏఈ పరమేశ్ బుంగను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. సకాలంలో కట్టకు మరమ్మతులు చేపట్టకపోతే పెను ప్రమాదం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, బుంగ పడిన ప్రదేశంలో ఇసుక బస్తాలతో పూడ్చివేయనున్నట్లు ఏఈ రైతులకు తెలిపారు.


వృథాగా పోతున్న నీరు

'యంగ్ ఇండియా'కు స్థలాలు ఖరారు

అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

- మొదటి విడతలో కొడంగల్, తాండూరులో నిర్మాణం
- ఒకే గొడుగు కిందకు గురుకుల రెసిడెన్షియల్స్
- ఈ ఏడాది బడ్జెట్‌లో నిధుల కేటాయింపు
- రెండో దశలో వికారాబాద్, పరిగిలో..


యాలాల మండలం దౌలాపూర్ వద్ద కేటాయించిన స్థలం

తాండూరు, సెప్టెంబరు 11: అన్ని రకాల గురుకుల విద్యాలయాలను ఒకే గొడుగు కిందకు తెచ్చేందుకు సర్కారు చర్యలు చేపట్టింది. విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్' స్కూళ్లను ఏర్పాటు చేయబోతుంది. నాణ్యమైన విద్య, వసతి అందించే విధంగా మోడల్స్‌ను తయారు చేశారు. తొలి యేడాది తాండూరు డివిజన్ పరిధిలో తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో ఈ విద్యాలయాలను ఏర్పాటు చేయబోతున్నారు. ఇందుకు అవసరమైన 20ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు గుర్తించారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గలైన పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్' స్కూళ్ల ఏర్పాటుకు యాలాల మండలం దౌలాపూర్ గ్రామశివారు కొడంగల్ మార్గంలో సర్వే నెంబరు 69లో 23.5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ స్థలాన్ని రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం కేటాయిస్తూ కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే ఆర్డీవోను ఆదేశించారు. తాండూరు డివిజన్ పరిధిలోకి వచ్చే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించే కొడంగల్ నియోజకవర్గంలో మోడల్ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. కొడంగల్ రెవెన్యూ గ్రామంలో సర్వే నం. 496లో 20ఎకరాలు కేటాయించారు.

ఒకే ప్రాంగణంలో..

ప్రస్తుతం ఎక్కడెక్కడో వేర్వేరుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ జనరల్ గురుకుల పాఠశాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురానున్నారు. 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో ఒకే ప్రాంగణంలో ఈ గురుకులాలన్నింటినీ నిర్మించనున్నారు. అన్నివర్గాల విద్యార్థుల మధ్య స్నేహభావం పెరిగి అంతరాలు తొలగిపోయే ఆస్కారముంటుందని సర్కార్ శ్రీకారం చుట్టింది. షెడ్యూల్డ్ కులాల, షెడ్యుల్డ్ తెగల సంక్షేమం కోసం ఈ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి అవసరమైన బడ్జెట్‌ను కేటాయించారు.

పరిగి, వికారాబాద్‌లో చాలని జాగలు

పరిగి, వికారాబాద్ నియోజకవరాల్లో గుర్తించిన స్థలాలు సరిపోవడం లేదు. 20 నుంచి 25 ఎకరాలు కావాల్సి ఉండగా, పరిగిలో 7.25 ఎకరాల ప్రభుత్వ భూములను గుర్తించారు. వికారాబాద్‌లో 20 ఎకరాల స్థలం గుర్తించినప్పటికీ అలంపల్లిలో 10 ఎకరాలు, గంగారంలో 10 ఎకరాల భూములు వేర్వేరుగా ఉండడంతో ఇక్కడ నిర్మించడం సాధ్యం కాదు. తాండూరు, కొడంగల్‌లో అవసరమైన మేరకు ప్రభుత్వ భూమి ఉండడంతో మొదటి దశలో ఈ రెండు సెగ్మెంట్లలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి లైన్ క్లియర్ అయింది.

జిల్లాలో సూళ్ల ఏర్పాటుకు స్థలాల గుర్తింపు ఇలా

నియోజకవర్గం	రెవెన్యూ పరిధి	సర్వే నం.	విస్తీర్ణం (ఎకరాల్లో)
తాండూరు	దౌలాపూర్	69	23.05
కొడంగల్	కొడంగల్	469	20.01
వికారాబాద్	అలంపల్లి	503	10
	గంగారం	67	10
పరిగి	పరిగి	530	7.25

ఈ ఏడాది నిర్మాణ పనులు ప్రారంభిస్తాం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం ఆలోచనలతో దేశంలో ఎక్కడ లేని విధంగా విద్యకు ప్రాధాన్యతమిస్తూ' యంగ్ ఇండియా ఇంటి గ్రేటేడ్ ' స్కూళ్లను నిర్మించుకోబోతున్నాం. జిల్లాలోనే తాండూరు నియోజవర్గంలో మొదట స్థల సేకరణ ప్రక్రియను పూర్తి చేశాం. ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి త్వరలో ఉత్తర్వులు రానున్నాయి.

-మనోహర్‌రెడ్డి , తాండూరు ఎమ్మెల్యే

అంచనా వ్యయం ఖరారు కాలేదు



ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి అంచన ఎంత అన్న విషయాన్ని ఇంకా ప్రభుత్వంతేల్చ లేదు. ఇంకా పూర్తిస్థాయి నమూనా కూడా ఖరారు కావాల్సి ఉంది. మోడల్‌గా కొడంగల్, మధిరలో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ఎంత ఖర్చు అవుతుందో లెక్కించి ఇతర ప్రాంతాల్లో నిర్మించేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయనున్నారు.

-శ్రీనివాస్ రావు , ఆర్డీవో

పంటకు నిప్పు పెట్టిన రైతు

వర్షాలకు పాడైన మినప చేను

మర్పల్లి, సెప్టెంబరు 11: చేతికి వచ్చిన మినుము పంట ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతింది. దీంతో పెట్టుబడి కూడా రాక తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికొచ్చే ముందు పంట దెబ్బతినడంతో రైతు కన్నీరుమున్నీరై పంటకు నిప్పు పెట్టాడు. ఈ సంఘటన మర్పల్లి మండలం నర్సాపూర్ చిన్న తండాలో బుధవారం జరిగింది. తండాకు చెందిన రతన్‌సింగ్ అనే రైతు రూ.30 వేల పెట్టుబడి పెట్టి ఎకరా మినప పంటను సాగు చేశాడు. అంతా బాగానే ఉంది త్వరలో చేతికొస్తుంది అన్న సమయంలో కురిసిన భారీ వర్షాలకు పంట పూర్తి నేలవాలి కుళ్లిపోయింది. దీంతో చేసేదేమి లేక ఆ పంటకు నిప్పంటించి లబోదిబోమన్నాడు. మర్పల్లి మండలంలోని నర్సాపూర్, పంచలింగాల తండాలో వందల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.


మినప చేనుకు నిప్పు పెడుతున్న రైతు

పెట్టుబడి కూడా పోయింది



ఎకరా పొలంలో మినప పంటను సాగు చేశాను. విత్తనాలు, పురుగు మందుల కోసం రూ.10వేలు ఖర్చు చేశాను. ఈ భారీ వర్షంతో పంట పూర్తిగా దెబ్బతిన్నది. చేతికి వచ్చే ముందు పంట కళ్ల ముందే పాడె తీరని నష్టం మిగిల్చింది.

-నారాయణ, రైతు, పంచలింగాల

672 మంది పిల్లల్లో పౌష్టికాహార లోపం

● రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 11 : జిల్లాలో పౌష్టికాహార లోపంతో 672 మంది పిల్లలు బాధ పడుతున్నారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెలలో జరిగే పోషణ మాసోత్సవ కార్యక్రమం గురించి జిల్లాలోని వైద్యాధికారులకు, సిబ్బందికి వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 672 మంది చిన్నారులు తీవ్రమైన పోషకాహారలోపం వల్ల, 3,128 మంది మాధ్యమిక పోషకాహార లోపం వల్ల ఐదు సంవత్సరాలలోపు పిల్లలు బాధపడుతున్నట్లు తెలిపారు. ఇందులో తీవ్రమైన పౌషకారలోపం పిల్లలకి వైద్యాధికారులు చికిత్స అందిస్తూ వారు మామూలు స్థితికి వచ్చేలా చేయాలని సూచించారు. అదేవిధంగా మాధ్యమిక పోషకాహార లోపం పిల్లలకి బాలామృతం ప్లస్ ద్వారా అందించే పోషక విలువలున్న పదార్థాలను తీసుకునేటట్లుగా పిల్లల తల్లిదండ్రులకి నచ్చచెప్పాలని సూచించారు. దీని ద్వారా పిల్లల్లో రక్తహీనత నివారించబడుతుందని తెలిపారు. ప్రతీ అంగన్వాడీ కేంద్రంలోని ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ గ్రోత్ మానిటరింగ్ చేసే విధంగా సహకరించాలని తెలిపారు. తల్లులకు కచ్చితంగా తల్లి పాల గురించి తెలపాలని, అదనపు ఆహారం యొక్క విలువను తెలపాలని, అన్ని సీజన్లలో దొరికే పండ్లను పిల్లలకు తినిపించేలా సూచించాలన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే కంటిన్యూ చేయాలని, జ్వరం ఉన్నవారిని గుర్తించినప్పుడు సకాలంలో చికిత్స చేసి ఆ చుట్టూ ఉన్న ఇండ్లలో ఇంకెవ్వరికీ రాకుండా రక్త పరీక్షలు చేయాలని, క్యాంపులు పెట్టి చికిత్సలు అందించాలని సూచించారు. ఎక్కడ కూడా డెంగీ జ్వరాలు, ఇతర వ్యాధులతో మరణాలు సంభవించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గణేష్ నిమజ్జనం స్థలాలలో హెల్త్ క్యాంపులు పెట్టాలని, 108 వాహనాలను సిద్ధంగా ఉండేటట్లు చూడాలని ఆయన తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డాక్టర్ శోభ, డాక్టర్ తిరుపతిరావు జిల్లా మాస్ మీడియా అధికారి గారు శ్రీనివాస్, ఆనంద్ పాల్గొన్నారు.

మహావీర్ వైద్య కళాశాలకు మృతదేహం అప్పగింత

● మరణానంతరం డెడ్‌బాడీని అప్పగించాలని సూచించిన 75 ఏళ్ల మహిళ

● వైద్య విద్యార్థుల ప్రయోగార్థం నిర్ణయం

వికారాబాద్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మరణాంతరం తన శరీరం వైద్య విద్యార్థుల ప్రయోగాల కోసం ఉపయోగపడాలన్న ఓ వృద్ధ మహిళ కోరికను ఆమె కుమారుడు నెరవేర్చాడు. హైదరాబాద్‌కు చెందిన భారతమ్మ(75) తాను మృతిచెందిన తర్వాత శరీరాన్ని వైద్య విద్యార్థులు తమ ప్రయోగాల కోసం ఉపయోగించుకునేందుకు వీలుగా ఓ వైద్య కళాశాలకు అప్పగించాలని కుమారుడిని కోరింది. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన భారతమ్మ మృతదేహాన్ని ఆమె కోరిక మేరకు కుమారుడు కేపీ ముని సురేష్ పిళ్లై వైద్య కళాశాలకు అందజేసేందుకు ముందుకు వచ్చారు. హైదరాబాద్‌లోని అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహకుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంజి ఈశ్వర లింగం ఆధ్వర్యంలో భారతమ్మ మృతదేహాన్ని బుధవారం వికారాబాద్‌లోని మహావీర్ వైద్య కళాశాలకు అందజేశారు. అంతకు ముందు ఇందుకు సంబంధించిన డాక్యుమెంటేషన్ ప్రక్రియను సురేష్ పిళ్లై పూర్తిచేశారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్, పరిపాలనా విభాగం ఇన్‌చార్జి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బతికి ఉండగా రక్తదానం, బ్రెయిన్‌డెడ్‌తో అవయవ దానం, మరణం తర్వాత నేత్రదానం, శరీర దానం సమాజానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఆ దిశగా అమ్మ నేత్ర అవయవ శరీర దాన ప్రోత్సాహకుల సంఘం కృషి చేయడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు.

నిండుకుండల్లా చెరువులు, కుంటలు



యాచారం : నిండుకుండలా తాటిపర్తిలోని గండికుంట

» వరద నీరు చేరడంతో అలుగు పారుతున్న తటాకాలు

యాచారం, సెప్టెంబరు 11 : ఇటీవల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురియడంతో అడవుల నుంచి వరద నీరు చెరువులు, కుంటల్లోకి వచ్చి చేరుతోంది. అడవుల్లో ఉన్న చెక్‌డ్యాంలు నిండి అలుగు పారుతుండడంతో వరద నీరు చెరువులు, కుంటల్లోకి వచ్చి చేరుతోందని సంబరపడుతున్నారు. మండల పరిధిలోని శంకరాయమల, తాటిపర్తి, కుర్మిద్ద అడవుల నుంచి భారీగా వరద నీరు రావడంతో చెరువులు, కుంటలు నిండుతున్నాయి. ఇప్పటికే తాటిపర్తిలోని గండికుంట, కుర్మిద్దలోని ధర్మపురి చెరువు, వెంకటయ్యకుంటలు రెండు రోజులుగా అలుగు పారుతున్నాయి. దాంతో నానక్‌నగర్, మేడిపల్లి, తక్కళ్లపల్లి, చింతపట్ల, మంతన్‌గౌరెల్లి గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి చేరి అటు నుంచి నల్గొండ జిల్లా శివన్నగూడ, మర్రిగూడ మండలాలకు చేరుతోంది. కుర్మిద్దలోని వెంకటయ్యకుంట, ధర్మపురి చెరువు నిండడడంతో కందుకూరు మండలంలోని ఆకులమైలారం మైల్లమ్మ చెరువులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. నానక్‌నగర్, మేడిపల్లి గ్రామాల్లోని చెరువుల్లోకి 45శాతం వరద నీరు వచ్చి చేరింది. తాటిపర్తిలోని బందం చెరువు 40శాతం మేర నిండింది.



బొంరాస్‌పేట్ : నిండుకుండలా బొంరాస్‌పేట్ పెద్దచెరువు



యాచారం: బంధం చెరువు తూము వరకు చేరుకున్న నీరు

బొంరాస్‌పేట్ పెద్ద చెరువుకు జలకళ

బొంరాస్‌పేట్ : ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో బొంరాస్‌పేట్ పెద్ద చెరువు జలకళను సంతరించుకుంది. పెద్ద చెరువుకు వచ్చే ఏటి కాల్వ వారం రోజుల క్రితం తెగిపోవడంతో నీరంతా వాగులోకి చేరింది. చెరువు నిండుకుండలా మారి బుధవారం అలుగు పారింది. దాంతో ప్రజలు ఆయకట్టు రైతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాగా, పెద్దచెరువు కింద 800 ఎకరాల్లో ఆయకట్టు సాగయ్యే అవకాశాలున్నాయి.

ప్రకృతి సంపదను పెంపొందించాలి

» పర్యావరణ శాస్త్రవేత్త డా.ఉమామహేశ్వర్ రెడ్డి



మాట్లాడుతున్న పర్యావరణ శాస్త్రవేత్త ఉమామహేశ్వర్ రెడ్డి

కడ్తాల్, సెప్టెంబరు 11: ప్రకృతి సంపదను పెంపొందించాలని, లేని యెడల మానవాళి మనుగడకు ప్రమాదమని ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అన్మాస్‌పల్లి సమీపంలో గల దిఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ ఎర్త్‌క్లబ్, యంగ్ ఎర్త్ లీడర్స్ రెండో విడత అవగాహన కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. కౌన్సిలర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డిల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి డా.ఉమామహేశ్వర్‌రెడ్డి, పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ డీఎస్‌వో శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సదస్సులో మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సాయి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నేల, వ్యవసాయం, ప్రకృతి మధ్యగల అవినాభావం, సంబంధాలపై విద్యార్థులకు తెలిపి వ్యవసాయ పరిజ్ఞానం పెంపొందించాలన్నారు. సీజీఆర్ సలహాదారు వెంకట్ రెడ్డి, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఐకార్ ఎంట్రెన్స్‌లో తలకొండపల్లి మండలవాసికి 14వ ర్యాంక్



తలకొండపల్లి, సెప్టెంబరు 11 : మండల పరిధిలోని వెంకట్రావ్‌పేటకు చెందిన చప్పిడి శివ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐకార్) ఏఐఈఈఏలో జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించాడు. వెంకట్రావ్‌పేటకు చెందిన చప్పిడి తిరుపతయ్య సుశీల దంపతుల కుమారుడు శివ ఏఐఈఈఏ-2024 ప్రవేశ పరీక్షలో అత్యంత ప్రతిభ కనబరిచి 14వ ర్యాంక్ సాధించాడు. ఈ మేరకు బుధవారం ఫలితాలు వెలువడ్డాయి. చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించి జాతీయ స్థాయిలో ర్యాంక్ సాధించిన శివను పలువురు అభినందించారు. గతంలో అగ్రికల్చర్ ఇంజనీరింగ్ సెట్ ఫలితాల్లో శివ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించాడు.



వినోభాబావే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బక్కని నర్సింహులు, తదితరులు

'భూదాన్' భూములను పరిరక్షించండి

» వినోభాబావే జయంతిలో బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 11: భూస్వాముల నుంచి సేకరించి, పేదల జీవనోపాధి కోసం పంపిణీ చేసిన భూధానోద్యమ భూములను పరిరక్షించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పద్మశాలి భవనంలో బుధవారం వినోభాబావే 129వ జయంత్యుత్సవాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. బక్కని మాట్లాడుతూ మహారాష్ట్రలో పుట్టి దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన వినోభాబావే ఆశయాన్ని రియల్టర్లు, స్వార్థ రాజకీయ నాయకులు నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినోభాబావే దేశ వ్యాప్తంగా పాదయాత్ర చేసి దాదాపు 46 లక్షల ఎకరాల భూమిని సేకరించి, పేదలకు పంచారని తెలిపారు. షాద్‌నగర్ ప్రాంతంలో కూడా పలువురు భూములను ఇచ్చారని తెలిపారు. నాడు రాష్ట్ర వ్యాప్తంగా కోటీ 70 లక్షల జనాభా ఉన్నప్పుడు భూమి కోసం సాయుధ పోరాటాలు జరిగాయని, నేడు 4 కోట్ల జనాభా ఉన్నా కూడా భూమి కొనుగోలుపై పరిమితిని విధించకపోతే ఎలా అని ప్రశ్నించారు. పట్టణ ప్రముఖులు పరిగి వెంకటసాయిశ్వర్‌రెడ్డి, సాయికృష్ణ, లింగారం కుమార్‌గౌడ్, వి. గంగిరెడ్డి, ఒగ్గు కిషోర్, పద్మశాలి సంఘం నాయకులు జనార్ధన్, చెన్న బాల్‌రాజ్, సత్యనారాయణ, బసా రాజేందర్, బాలాజీ, దాస రమేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోషణ మాసం.. ఆరోగ్య రక్షణే లక్ష్యం

» జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు

మేడ్చల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పోషకాహారం ఆరోగ్యవంతమైన జీవనానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. గర్భంలోని శిశువు ఎదుగుదల నుంచి శిశువు జన్మించే వరకు.. ఆ తరువాత పెరుగుతున్న పిల్లలకు తగిన పోషకాహారం అందిస్తే ఎంతో మేలు చేకూరుతుంది. ఆరోగ్య సమస్యలు తలెత్తవు.

ప్రభుత్వాల ప్రత్యేక దృష్టి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాయి. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందజేస్తున్నారు. అయినప్పటికీ కొన్ని కుటుంబాలు వీటిని అందిపుచ్చుకోవడం లేదు. కొందరు తల్లిదండ్రులు కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా తమ పిల్లలకు పౌష్టికాహారం అందించలేకపోతున్నారు. రోజువారీ కూలీలుగా పనిచేసే కుటుంబాలు పోషణ విషయంలో తగిన శ్రద్ధ చూపడం లేదు. ఇటువంటి కుటుంబాలకు పోషణ మాసోత్సవాల్లో పోషకాహారం అందించనున్నారు.

పోషకాహార లోపం ఉన్నవారు..

జిల్లాలో 34,267 మంది పోషకాహారం లోపం లేకుండా సాధారణంగా ఉన్నారు. అతి తీవ్ర లోపంతో 7,139 మంది, మధ్యస్త లోపంతో 17,531 మంది పోషకాహారం లోపంతో ఉన్నట్లు గుర్తించారు.

పౌష్టికాహారం పంపిణీ

పోషకాహార లోపంతో ఉన్న గర్భిణీలు, బాలింతలను గుర్తించి పౌష్టికాహారం అందిస్తారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం, బాలామృతం ప్లస్ అందజేస్తున్నారు. గుర్తించిన వారికి తగిన వైద్యం అందేలా చూడటంతో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు కౌన్సిలింగ్ ఇప్పిస్తారు. రక్తహీనత, పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతారు.

పండగ వాతావరణంలో కార్యక్రమాలు

పోషణ మాసోత్సవం సెప్టెంబరు 1న ప్రారంభమైంది. విద్య, వైద్యం, పంచాయతీరాజ్ శాఖల సహకారంతో గ్రామీణ స్థాయిలో రోజూ ఒక కార్యక్రమాన్ని ఎంపిక చేసుకుని ఈ నెల 30 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తారు. పిల్లలకు ఆట పాటలు, మాతృపోషణ, తక్కువ బరువు, ఎత్తు, పౌష్టికాహార లోపం ఉన్న పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లడం, కిశోర బాలికలకు తగిన సూచనలు, ఆరోగ్య కార్యక్రమాలు, మొక్కలు నాటడం, తదితరాలను పండుగ వాతావరణంలో చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయిస్తున్నారు. ప్రజలు భాగస్వామ్యంతో గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారం, తదితర అంశాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇప్పటికే దిశానిర్దేశం చేశారు.



పోషణ్ అభియాన్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా మహిళా సంక్షేమాధికారి కృష్ణారెడ్డి (ఫైల్)

జిల్లావ్యాప్తంగా బాధితుల నివేదిక

జిల్లావ్యాప్తంగా మొత్తం 1,13,471 మంది పిల్లలను పరిశీలించారు. వీరిలో 34,267 మంది సాధారణ బరువు కలిగి ఉన్నారు. అతి తక్కువ బరువు ఉన్న పిల్లలు 7,139 మంది ఉండగా మధ్యస్త బరువు ఉన్నవారు 17,531 మందిని గుర్తించారు.

ఏటా రెండుసార్లు పోషణ్ పక్వాడా

మార్చి నెలలో పోషణ్ పక్వాడా పేరుతో 15 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాం. సెప్టెంబరు మాసంలో పోషణ మాసోత్సవం పేరిట వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తాం. మాసోత్సవాన్ని జిల్లా అంతటా విస్తృతంగా నిర్వహిస్తాం.

- కృష్ణారెడ్డి, మహిళా శిశు సంక్షేమ అధికారి

'టాస్క్' సీవోవోగా రాఘవేందర్‌రెడ్డి?

త్వరలో నియామక ఉత్తర్వులు



ఆమనగల్లు, సెప్టెంబరు 11 : తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు, నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చౌదర్‌పల్లికి చెందిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేరు ఖరారైందని విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒకటి రెండు రోజుల్లో ఆయనకు నియామక ఉత్తర్వులు అందనున్నట్లు సమాచారం. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో కొనసాగే అకాడమీకి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. వృత్తి నైపుణ్యం ఉన్న యువతను గుర్తించి వారికి ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడానికి, రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలల స్థాయిలో విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్కిల్ నాలెడ్జ్ అకాడమీకి కొత్తగా సీవోవో పోస్టును ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. ఈ పోస్టుకు ఇప్పటికే సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేరు ఖరారైనట్లు సమాచారం. అకాడమీ సీఈవో నుంచి రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడనున్నట్లు అధికార వర్గాల ద్వారా సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా ముచ్చర్ల ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో గత రెండేళ్లుగా కల్వకుర్తి నియోజకవర్గంలో యువత, విద్యార్థుల్లో వృత్తి నైపుణ్య శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి, ఉపాధి కల్పనకు కృషి చేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేరును సీవోవోగా ఎంపిక చేసినట్లు ప్రాథమిక సమాచారం.

బూట్ క్యాంప్‌లతో విద్యార్థుల నైపుణ్యాలు మెరుగు

» ఢిల్లీ ఫైనాన్స్ బ్యూరో డైరెక్టర్ గుజ్జు మనుశ్రీ



బూట్ క్యాంపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మనుశ్రీ

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 11: విద్యార్థుల ఆలోచనలకు పదును పెడుతూ.. నూతన ఆవిష్కరణలు చేపట్టేలా వారిలో నైపుణ్యాలను పెంపొందించేందుకు బూట్ క్యాంపులు ఎంతగానో దోహద పడతాయని ఢిల్లీ ఫైనాన్స్ బ్యూరో డైరెక్టర్ గుజ్జు మనుశ్రీ, ఏఐసీటీఈ ఇన్నోవేషన్ సెంటర్ మేనేజర్ డాక్టర్ భీమారెడ్డి తెలిపారు. బుధవారం శంషాబాద్‌లోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో అఖిల భారత సాంకేతిక విద్యామండలి ఆధ్వర్యంలో ఈ నెల 11, 12వ తేదీల్లో నిర్వహిస్తున్న బూట్ క్యాంపును పాఠశాల విద్యాశాఖ ఏపీఎస్డీ రాజీవ్, పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ, రాష్ట్ర ప్లానింగ్ అండ్ యంఐఎస్ కో-ఆర్డినేటర్ సంపత్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీఆర్ రవీంద్రతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మనుశ్రీ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల ప్రోత్సాహకాలను విద్యార్థులకు చేరేలా బూట్ క్యాంపు దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అటల్ టింకరింగ్ ల్యాబ్స్ తరహాలో ఐడియా ల్యాబ్స్‌ను నెలకొల్పేందుకు అందిస్తున్న సహకారంపై పి.రాజీవ్ తెలిపారు. బూట్ క్యాంపులో విద్యార్థులు నేర్చుకున్న విషయాలను పాఠశాలకు వెళ్లిన తర్వాత ఇతర విద్యార్థులతో చర్చించాలని సూచించారు. వెంకట నర్సమ్మ మాట్లాడుతూ సాంప్రదాయ విద్యను డిజిటల్ విద్యగా మార్చే క్రమంలో పీఎం శ్రీ స్కూల్స్ ఎంతో మెరుగ్గా పని చేస్తున్నాయని తెలిపారు. ఏఐసీటీఈ అసిస్టెంట్ ఇన్నోవేషన్ డైరెక్టర్ ఎలంగోవన్ కరియప్పన్, హైదరాబాద్ ఇన్నోవేషన్ సెంటర్ మేనేజర్ భీమారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచన విధానాన్ని పెంపొందించేలా నూతన ఆవిష్కరణలు చేపట్టేలా ఏఐసీటీఈ ఆధ్వర్యంలో 29 జూలై 2025లో నిర్వహించే స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌లో పాల్గొనాలని తెలిపారు. వారి ఆవిష్కరణలు సృజనాత్మకత కలిగి ఉంటే రూ.1.5 లక్షల ప్రోత్సాహక నగదు అందివ్వనున్నట్లు చెప్పారు. నోడల్ సెంటర్ ఎస్‌పీడీసీ డాక్టర్ జె.కృష్ణచైతన్య, నోడల్ సెంటర్ కో-ఆర్డినేటర్‌లు డాక్టర్ ఎస్.రాజేందర్, జె.సాయి, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్‌తో పంటలపై మందులు స్ప్రే చేసే విధానాన్ని వివరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

అధునాతన యంత్రాలతో సేద్యంపై దృష్టి సారించాలి

» కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త వీకే సింగ్

యాచారం, సెప్టెంబరు 11 : అత్యంత అధునాతన యంత్రాలతో సాగు చేయడంపై ప్రధానంగా రైతులు దృష్టి సారించాలని, ముఖ్యంగా యంత్రాల కొనుగోలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతనిస్తున్నాయని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ వీకేసింగ్ వెల్లడించారు. బుధవారం యాచారం మండలం గడ్డమల్లాయగూడలో కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డ్రోన్‌తో రసాయన మందులు స్ప్రే చేయడం, కూరగాయల విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తక్కువ పొలంలో తక్కువ పెట్టుబడులతో పంటలు సాగు చేయడం చాలా మంచిదన్నారు. రైతులు నానో యూరియా, నానో డీఏపీ వాడాలన్నారు. క్రిమి కీటకాలను తట్టుకొని మంచి దిగుబడి ఇచ్చే విత్తనాలు నాటుకోవాలని చెప్పారు. ముఖ్యంగా వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా రైతులు చొరవ తీసుకోవాలన్నారు. కరువును తట్టుకొని మంచి దిగుబడినిచ్చే విత్తనాలు వాడితే రైతులకు మంచి లాభాలు వస్తాయని వెల్లడించారు. సమావేశంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ భార్గవి, డాక్టర్ గిరిజావేణి, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ సంజీవరెడ్డి, డాక్టర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాత్రివేళ డ్రోన్ల కలకలం

» భయాందోళనలో గ్రామస్తులు.. పోలీసులకు ఫిర్యాదు

యాచారం, సెప్టెంబరు 11 : మండలంలోని చింతపట్ల, మొండిగౌరెల్లి గ్రామాల్లో మంగళవారం రాత్రి 9.30 గంటల నుంచి 12 గంటల వరకు ఆకాశంలో డ్రోన్లు ఎగరడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు రెండు అధునాతన డ్రోన్లు ఎగరేయడంతో జనం భయంతో వణికిపోయారు. కాగా, వాటిని చూసిన గ్రామస్తులు.. ఎవరైనా బాంబులు వేసేందుకు పథకం వేశారా? లేక ఆయా గ్రామాల పరిసరాల్లో ఉన్న పశువులు, మేకలు, గొర్రెలు అపహరించేందుకు ఆరా తీశారా? అని భయపడ్డారు. సమాచారం అందుకున్న యాచారం పోలీసులు రెండు గ్రామాలకు వచ్చివెళ్లే రహదారుల్లో నిఘా పెట్టి డ్రోన్‌లు ఎగరేసిన వారిని పట్టుకునేందుకు యత్నించారు. ఫలితం లేకపోవడంతో విచారణ వేగవంతం చేసినట్లు సీఐ శంకర్ కుమార్ తెలిపారు. ఈ విషయంలో గ్రామస్తులు ఆందోళన చెందవద్దని ప్రజలకు సూచించారు.

రుణమాఫీకి దరఖాస్తు చేసుకోవాలి

కులకచర్ల, సెప్టెంబరు 11: రుణమాఫీ కాని రైతులు కులకచర్ల రైతు వేదికలో దరఖాస్తు చేసుకోవాలని ఏవో వీరస్వామి తెలిపారు. కులకచర్లలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో పర్యటించి రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించినట్లు తెలిపారు. ఉమ్మడి మండల పరిధిలో రుణమాఫీ కాలేదని 428 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని, గ్రామాల్లో పర్యటించి ఇప్పటి వరకు 302 మంది రైతుల వివరాలు సేకరించినట్లు తెలిపారు.



నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు, ఏబీవీపీ నాయకులు

స్కూల్లో ర్యాగింగ్, డ్రగ్స్‌ను అరికట్టాలి

» డీఆర్ఎస్ పాఠశాల ఎదుట

విద్యార్థుల తల్లిదండ్రులు, ఏబీవీపీ నాయకుల నిరసన

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 11 : ర్యాగింగ్, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడంలో పాఠశాల యాజమాన్యం విఫలమయ్యిందంటూ బుధవారం ఏబీవీపీ నాయకులతో కలిసి పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు గుండ్లపోచంపల్లి మైసమ్మగూడలోని డీఆర్ఎస్ ఇంటర్‌నేషనల్ స్కూల్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తల్లిదండ్రులు పాఠశాల నిర్వాహకులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన పాఠశాలలో ర్యాగింగ్ సంస్కృతిని పాఠశాల యాజమాన్యం పరోక్షంగా ప్రోత్సహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతో విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటుపడ్డారని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. పాఠశాల నియంత్రణ కోల్పోయిన యాజమాన్యంపై, విద్యార్థుల భవిష్యత్తును పట్టించుకోని ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్కూల్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఏబీవీపీ నాయకులను అరెస్టు చేశారు. అయితే, నిరసనపై యాజమాన్యం నోరు మెదపకపోవటం గమనార్హం.

హరీశ్వర్‌రెడ్డి అందరివాడు

» పరిగి మాజీ ఎమ్మెల్యే వర్ధంతి సభలో

మాజీ మంత్రులు,మాజీ ఎమ్మెల్యేలు



హరీశ్వర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హరీష్‌రావు, సబితారెడ్డి, మధుసూధనాచారి, మాజీ ఎమ్మెల్యేలు

పరిగి, సెప్టెంబరు 11: రాజకీయ దురంధరుడు, సీనియర్ నేత దివంగత కొప్పుల హరీశ్వర్‌రెడ్డికి రాజకీయాల్లో అందరివాడిగా పేరుప్రతిష్టలు తెచ్చుకున్నారని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కొనియాడారు. ఉమ్మడి ఏపీ మాజీ ఉపసభాపతి, పరిగి మాజీ ఎమ్మెల్యే దివంగత హరీశ్వర్‌రెడ్డి ప్రథమ వర్ధంతిని బుధవారం పరిగిలోని ఎస్ గార్డెన్‌లో నిర్వహించారు. రాష్ట్రంలోని పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొని హరీశ్వర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కర్మ క్రియలను హరీశ్వర్‌రెడ్డి తనయుడు మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో పండితుడు సిద్దాంతి పార్థసారథి నిర్వహించారు. నియోజకవర్గం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు హరీశ్వర్‌రెడ్డి చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూధనాచారిలు మాట్లాడుతూ రాజకీయ దురంధరుడు, సీనియర్ నేత కొప్పుల హరీశ్వర్‌రెడ్డికి రాజకీయాల్లో అందరివాడిగా పేరుప్రతిష్టలు తెచ్చుకున్నారని కొనియాడారు. ఏనాడు రాజకీయాల్లో 'కోపం' అనే పదమే తెలియని నేతగా ముద్ర వేసుకున్నారన్నారు. ఎప్పుడూ ఆయన ముఖంలో చిరునవ్వే.. కష్టాలొచ్చినా, కన్నీళ్లొచ్చినా నేనున్నానని వెన్నుతట్టి నిలబడే నాయకుడిగా పేరుప్రతిష్టలు ఆయనకే చెల్లుతాయని కొనియాడారు. కార్యక్రమానికి చేవెళ్ల మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, మునిసిపల్ చైర్మన్ అశోక్, నాయకులు కార్తీక్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, సురేందర్, బి.ప్రవీణ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.



అవగాహన కల్పిస్తున్న ఆశారాం బాపు సేవా సమితి సభ్యులు

యోగా, ధ్యానంపై విద్యార్థులకు అవగాహన

కొడంగల్, సెప్టెంబరు 11: శ్రీ ఆశారాం బాపు సేవా సమితి శంషాబాద్ వారి ఆధ్వర్యంలో బుధవారం కొడంగల్‌లోని జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగా, ధ్యానం, ప్రాణాయామంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ మానవ జీవితంలో యోగా, ధ్యానం, ప్రాణాయామం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు వీటిని ఆచరించడంతో జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతుందని తెలిపారు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మురళీధర్, ఉపాధ్యాయులు వెంకటేష్, ఆనంద్‌రావు, ఏసురత్నం, గోపీనాథ్, అజీజ్ పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి గణనాథులు



తాండూరు: గణనాథులకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు/యాలాల, సెప్టెంబరు 11: ఐదు రోజులుగా భక్తుల పూజలు అందుకున్న గణేశుడు బుధవారం గంగమ్మ ఒడికి చేరాడు. గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనానికి తరలించారు. తాండూరు పట్టణానికి 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న కోకట్ కాగ్నా నదిలో, తాండూరు పట్టణం మల్‌రెడ్డిపల్లి చెరువులో వినాయకులను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. భద్రేశ్వర్ చౌక్‌లో హిందూ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో స్వాగత వేదికను ఏర్పాటు చేసి గణనాధులకు పువ్వులు చల్లి స్వాగతం పలికారు. కోకట్ కాగ్నానది వద్ద కొడంగల్ శ్రీరామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించారు. యాలాల వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

వేలంలో రూ.3.61లక్షలు పలికిన లడ్డు

పట్టణంలోని కన్య పాఠశాల హనుమాన్ వార్డులో గణేష్ ఉత్సవ కమిటీ వేలం వేసిన గణపతి లడ్డును భక్తుడు బంటారం అభిలాష్ రూ.3లక్షల 61వేలకు దక్కించుకున్నాడు. బాలాజీ టెంపుల్‌లో గణేష్ లడ్డును భక్తుడు కిషోర్ రూ.లక్షా 91వేలకు వేలంలో కొనుగోలు చేశాడు.



తాండూరు రూరల్: దస్తగిరిపేట్‌లో గణేశ్ నిమజ్జనానికి సిద్ధం చేస్తున్న భక్తులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట్‌లో స్వాస్తిక్ వినాయక కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం లడ్డూ వేలం నిర్వహించారు. ఈ వేలంలో కుమ్మరి పాండు రూ.లక్షా 100లకు లడ్డూను దక్కించుకున్నాడు. అదేవిధంగా దస్తగిరిపేట్ లోని శ్రీవేంకటేశ్వర ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన మండపంలో మహాగణపతి లడ్డూ వేలం వేశారు. అంతారం గ్రామానికి చెందిన బి.అజయ్ బద్రి రూ.లక్షా 15వేలకు లడ్డూను దక్కించుకున్నాడు. ఈ గ్రామంలో అత్యధికంగా లడ్డూ వేలం వేయడం ఇదే మొదటి సారి. అనంతరం అంతారం పెద్దచెరువులో గణేశుడి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బీజే.శ్రీనివాస్, కమిటీసభ్యులు అజయ్ తదితరులు పాల్గొన్నారు.



తాండూరు: పాత తాండూరుకోట నుంచి నిమజ్జనానికి బయల్దేరిన వినాయకుడు

ధారూరు: ధారూరులో వినాయక సామూహిక నిమజ్జన ఊరేగింపు భక్తిశ్రద్ధలతో కొనసాగింది. గ్రామ పంచాయతీ వినాయకుని వద్ద నిమజ్జన పూజలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.రఘువీరెడ్డి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని వినాయకులను వీధుల గుండా ఊరేగించి నిమజ్జనం చేశారు. గణేష్ లడ్డూలను వేలం వేశారు.



ధారూరు: ధారూరులో వినాయక నిమజ్జన ఊరేగింపులో చిన్నారుల కోలాటం

వినాయక నిమజ్జనాలకు సర్వం సిద్ధం

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధి ఏదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువుకట్టపై అధికారులు వినాయక నిమజ్జన ఏర్పాట్లను పూర్తి చేశారు. లక్ష్మీనారాయణ చెరువులో దాదాపు చిన్నవి, పెద్దవి కలుపుకొని 3,500 నుంచి 4 వేల వినాయకులను నిమజ్జనం చేస్తారు. నిమజ్జనం ఏర్పాట్లను రాచకొండ సీపీ సుధీర్‌బాబుతో పాటు అయాశాఖల అధికారులు చెరువుకట్ట వద్ద నిమజ్జన పనులను పర్యవేక్షించారు. చిన్న వాహనాలు కట్టపైకి వినాయక ఘాట్ వద్దకు కాకుండా బతుకమ్మ ఘాట్ వద్ద నిమజ్జనం చేసేవిధంగా ఏర్పాట్లు చేశారు. వినాయక నిమజ్జన ఏర్పాట్లలో ఇబ్బందులు కలుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. వైద్య, రెవెన్యూ, ఆరోగ్య, మున్సిపల్, పోలీసు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి 24గంటలు వినాయక నిమజ్జన వద్ద అందుబాటులో ఉంటున్నారు. కాగా, వినాయక నిమజ్జనం కోసం మూడు క్రేన్లను ఏర్పాటు చేసినట్లు ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్ తెలిపారు. నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు తాత్కాలికంగా ఆరోగ్యకేంద్రం, పోలీసు కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశామని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి వెల్లడించారు. ఏదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో జరిగే వినాయక నిమజ్జనం వద్ద 113 మంది పోలీసులతో బందోబస్తు చేపట్టినట్లు ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు. నిమజ్జన సమయంలో గజఈతగాళ్లను అందుబాటులో ఉంచి 24 గంటలు పోలీసులు బందోబస్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



ఘట్‌కేసర్ రూరల్: వినాయకులను నిమజ్జనం చేయడానికి ఏర్పాటు చేసిన భారీక్రేన్లు

వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు

పరిగి: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పరిగి పట్టణంలోని వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో గణనాథులు నిత్యం పూజలు అందుకుంటున్నాయి. గణేశ్‌మండపాల దగ్గర అన్నదానం చేస్తున్నారు. మధురానగర్‌కాలనీ గణేశ్‌కమిటీ సభ్యులు మొగులయ్య, రాకేశ్, బుగ్గయ్యల ఆధ్వర్యంలో నిత్యం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

బొంరాస్‌పేట్: మండలంలోని బొట్లవని తండా గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో బుధవారం వినాయకుడికి విద్యార్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. మహంతీపూర్‌లో ప్రతిష్ఠించిన వినాయకులను నిమజ్జనానికి తరలించారు. బొంరాస్‌పేట్ మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయకులకు భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు.

వికారాబాద్: వినాయకుని కృపా కటాక్షాలు అందరిపై ఉండాలని మాజీ మంత్రి, భృంగీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఏ.చంద్రశేఖర్ ఆకాంక్షించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం వికారాబాద్ ఏసీఆర్ భృంగీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద మాజీ మంత్రి, పాఠశాల చైర్మన్ ఏ.చంద్రశేఖర్, ఆయన సతీమణి విద్యాసంస్థ కార్యదర్శి ప్రమీల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుమారస్వామి పాల్గొన్నారు.



మేడ్చల్: కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసినవినాయక మండపంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పూజలు

మేడ్చల్ టౌన్: మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్ ఫేస్-1లో కాలనీ వాసులు ఏర్పాటు చేసిన వినాయక మండపంలో స్థానికులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించరు. యువతులు, పిల్లలు నిర్వహించిన కోలాట నృత్యం స్థానికులను ఆకట్టుకుంది. కాలనీ వాసుల ప్రత్యేక ఆహ్వానంపై స్థానిక సీఐ సత్యనారాయణ మండపానికి చేరుకుని గణనాథుడికి ప్రత్యేకపూజలు చేశారు.

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లోని గట్టుమైసమ్మ ఆటోస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, స్థానికులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

కీసర రూరల్: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో గణపతి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఐదో పూజా కార్యక్రమాలు పురపాలికల్లోని అయా మండపాల వద్ద మంగళవారం గణపతి హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, స్థానికులు పెద్దు ఎత్తున తరలి వచ్చి గణనాథున్ని దర్శించుకుని అన్నదానం ప్రారంభించారు. నాగారం మున్సిపాలిటీ 7వ వార్డు బ్రహ్మయ్య కాలనీలో టీఆర్ఎస్ నాయకుడు గూడూరు ఆంజనేయులుగౌడ్, మధుగౌడ్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణలతో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఐదో రోజు నుంచి నిమజ్జనాలు ప్రారంభం కావటంతో నాగారం మున్సిపాలిటీ పెద్ద చెరువు, దమ్మాయిగూడ నాసిన్ చెరువు వద్ద భారీఏర్పాట్లు చేశారు.

క్రైం కార్నర్

పేకాడుతున్న 13మంది అరెస్ట్

● రూ.4.37లక్షల నగదు, సెల్‌ఫోన్లు, వాహనాలు స్వాధీనం

మూడుచింతలపల్లి, సెప్టెంబరు 11: పేకాట స్థావరంపై పోలీసులు మెరుపు దాడులు చేశారు. 13మందితో పాటు రూ.4లక్షల 37వేల నగదు, 15 సెల్‌ఫోన్లు, నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్, జీడిమెట్ల ప్రాంతానికి చెందిన 13మంది వినాయక నిమజ్జనాల కోసం శామీర్‌పేట్ చెరువు వద్దకు వచ్చారు. నిమజ్జనం పూర్తిచేసుకున్న తర్వాత వీరిలో ఒకరి జన్మదిన వేడుకల్లో భాగంగా మూడుచింతలపల్లి మండలం ఉషార్‌పల్లి గ్రామ పరిధిలో ఉన్న ఒక ఫామ్‌హౌస్‌ను తీసుకున్నారు. జన్మదిన వేడుకల పేరుతో పేకాడుతున్నారనే పక్కా సమాచారంతో ఎస్‌వోటీ, శామీర్‌పేట్ పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 13మందితో పాటు రూ.4లక్షల 30వేల నగదు, 15సెల్ ఫోన్లు, నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 11: ఉరేసుకుని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని సాగారం తండాలో చోటుచేసుకుంది. స్థానికుడు శివాజీ రాథోడ్ అనే వ్యక్తి మిజోరం రాష్ట్రానికి చెందిన ప్రీతి రాథోడ్(24)ను 2016లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈక్రమంలో వివాహం అనంతరం ముంబైలో కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. ప్రీతి రాథోడ్ కొన్ని నెలల నుంచి పుట్టింటికి దూరంగా ఉన్నానని బాధపడుతూ మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి బాత్‌రూంలో సీలింగ్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనపై బుధవారం ప్రీతిరాథోడ్ తండ్రి రాంధని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బొంరాస్‌పేట్ పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యం

మూడుచింతలపల్లి, సెప్టెంబరు 11: అనుమానాస్పదస్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన జీనోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాల్‌గడిమలక్‌పేట్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లాల్‌గడి మలక్‌పేట్ గ్రామానికి చెందిన మారి నర్సింహ(34) రోజువారీ కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాలను వెతకగా కుడి చెరువు వద్ద అజిత్ బావిలో వ్యక్తి మృతదేహం గమనించినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి మృతుడు మారి నర్సింహగా గుర్తించారు. నర్సింహ మృతిపై కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

దాడి చేసి బంగారు గొలుసు, నగదు చోరీ

పూడూరు, సెప్టెంబరు 11: ఆస్పత్రికి వెళ్లి వస్తున్న ఇద్దరు వ్యక్తులపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి బంగారం, నగదుచోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. చెన్‌గోముల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్‌కు చెందిన ఊరడి సాయికుమార్ తన స్నేహితురాలితో కలిసి చేవెళ్లలోని మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వెళ్లాడు. చికిత్స అనంతరం తిరిగి బైక్‌పై వస్తున్నారు. మార్గమధ్యలో కండ్లపల్లి గేటు వద్ద ఫొటోలు దిగేందుకు బైక్‌ఆపి కొంత లోపలికి వెళుతుండగా ఒక నెంబర్ లేని బైక్‌పై ముగ్గురు వ్యక్తులు వచ్చారు. అందులో ఇద్దరు వ్యక్తుల సాయికుమార్, ఆయన స్నేహితురాలి వద్దకు వచ్చి ముఖానికి ఉన్న మాస్కులు తీయాలని బెదిరించారు. మరో వ్యక్తి రాడు తీసుకువచ్చి సాయికుమార్ తలపై కొట్టగా మరోవ్యక్తి కత్తితో బెదిరించి ఆయన స్నేహితురాలి మెడలో ఉన్న తులం బంగారు చైన్, రూ.4వేల నగదును లాక్కుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెన్‌గోముల్ పోలీసులు తెలిపారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

కులకచర్ల, సెప్టెంబరు 11: బైక్ అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కులకచర్ల నుంచి బుధవారం సాయంత్రం బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి లింగంపల్లి మీదుగా వెళ్తున్నాడు. పటేల్ చెరువు తండాకు వెళ్లే రోడ్డు మూలమలుపులో అదుపు తప్పి కిందపడిపోయాడు. ఈ సంఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు ఆటోలో పరిగి ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి రంగారెడ్డి జిల్లా చౌదరిగూడెం మండలం ఘనపూర్ తండాకు చెందిన సంతోష్‌గా గుర్తించారు.

సీఎంఆర్‌ఎఫ్‌ను వినియోగించుకోవాలి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 11: పేదలు సీఎంఆర్‌ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కోరారు. బోయినపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం మేడ్చల్‌లోని గిర్మాపూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ భాస్కర్ యాదవ్, నాయకులు రిజిరెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా మేడ్చల్ పరిధిలోని పలువురికి మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి తన కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కౌడె మహేష్, మర్రినర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ప్రభుత్వం పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు ఘట్‌కేసర్ మున్సిపల్ కౌన్సిలర్ బొక్క సంగీతాప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని బొక్కోనిగూడ చౌరస్తావద్ద జరిగిన కార్యక్రమంలో బుధవారం ఆమె అంజయ్యకు రూ.47500, రాములమ్మకు రూ.24వేలు విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, మాజీ పంచాయతీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 11: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని పాఠశాల హెచ్‌ఎం శ్యామలమ్మ అన్నారు. కొడంగల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాంరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీవాణి, తిరుమలేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

జోన్ లెవల్ క్రీడా పోటీలకు ఎంపిక

మోమిన్‌పేట్, సెప్టెంబరు 11: జోన్ లెవల్ క్రీడా పోటీలకు ఎంపిక నిర్వహించనున్నట్లు జోనల్ స్థాయి అధికారి వసంతకుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండలంలోని మర్పల్లి, మోమిన్‌పేట్, బంటారం మండలాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులకు 2024-25 విద్యాసంవత్సరానికి క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 19 నుంచి 21 వరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

మేడ్చల్ అభివృద్ధికి సహకరించండి



సీఎంకు జ్ఞాపిక అందజేస్తున్న దీపిక నర్సింహారెడ్డి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 11: మేడ్చల్ మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. చైర్‌పర్సన్ సీఎంను బుధవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వేంకటేశ్వరస్వామి వారి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మేడ్చల్ పట్టణ పరిస్థితులను ముఖ్యమంత్రికి వివరిస్తూ మేడ్చల్ పట్టణ ప్రజల అవసరాలు తీర్చే పలు అభివృద్ధి పనులను వివరించారు. ప్రజలు తమ ప్రభుత్వంపై ఎంతో నమ్మకంతో ఉందని, మేడ్చల్ పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి పరిచేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి తమ పట్టణంపై ప్రత్యేక చొరవ చూపితే మరింత అభివృద్ధి పరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

'అనురాగ్'లో ఐసీటీ డిజిటల్ శిక్షణ

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 11: పోచారం మున్సిపాలిటీ వెంకటాపూర్, అనురాగ్ యూనివర్సిటీ లో బుధవారం సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఐసీటీ డిజిటల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సీఎస్ఈ డీన్ విష్ణుమూర్తి మాట్లాడుతూ.. సాంకేతిక నైపుణాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నేటి నుంచి ఈనెల 19 వరకు 60 మంది విద్యార్థులతో 180గంటల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. నైపుణ్యాలను అందిపుచ్చుకొని ముందుకుసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విజయ్‌కుమార్, రమణకుమార్, అశ్విని, భాగ్యరేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

మళ్లీ తెరపైకి పీపుల్స్ డిగ్రీ కళాశాల వివాదం



మాట్లాడుతున్న విద్యా వికాస్ సమితి సభ్యులు(ఫైల్)

తాండూరు,సెప్టెంబర్ 11: తాండూరు పీపుల్స్ డిగ్రీ కళాశాలకు చెందిన 33 ఎకరాల భూవివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. కళాశాల ఫౌండర్, చైర్మన్, మాజీ మంత్రి మాణిక్ రావు వర్ధంతి రోజు యాదవ్ సభార్య ప్రొఫెసర్ శశిప్రభ కళాశాల భూములు తమవేనని ట్రస్టుకు చెందుతాయని అన్నారు. ఆమెకు మద్దతుగా స్థానిక నేతలు కొందరు వివాదస్పద స్థలంపై మాట్లాడటం చర్చకు దారితీసింది. మాణిక్‌రావు మహరాజ్‌ల కుటుంబానికి ఆగ్రహం తెప్పించింది. మాజీమంత్రి స్వర్గీయ చంద్రశేఖర్ తనయుడు విద్యావికాస్ సమితి సభ్యులు ఎం.రాకేష్ మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాణిక్ రావు సతీమణి శశిప్రభపై సొంత పార్టీ నాయకులపై విమర్శలు గుప్పించారు. తమ కుటుంబం అధికారంలో ఉన్నప్పుడు ఇసుక, సుద్ద, నాపరాయి సెటిల్‌మెంట్లను ప్రోత్సహించలేదని సొంత పార్టీ వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా ఎమ్మెల్యే వారిని అదుపు చేయకుంటే ఆయనకు, పార్టీకి నష్టమని వ్యాఖ్యానించారు. తమ జోలికి వస్తే ఊరుకొమని తమ వాళ్ల బండారం బయట పెడుతామని హెచ్చరించారు. కళాశాల 16ప్లాట్లను శశిప్రభ బలవంతంగా విక్రయింపజేసి అట్టి డబ్బులతో కళాశాలకు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. మాణిక్‌రావు బతికి ఉండగానే మతిస్థిమితం లేదని సర్టిఫికెట్ పొంది ఆస్తులు కాజేయాలని చూశారని సమితిసభ్యులు ధారాసింగ్, ఉత్తంచంద్‌లు ఆరోపించారు.

సంక్షిప్తంగా..

● **మూడుచింతలపల్లి:** విపత్తులు, ఆపద సమయంలో తోటి వారికి సహాయపడి మానత్వాన్ని చాటుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యతని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ(ఏబీఏపీ) జాతీయ అధ్యక్షుడు కె.అయ్యప్పదాస్ అన్నారు. తుపాన్ కారణంగా ఖమ్మం జిల్లాలోని తిరుమలాపాలెం మండలం రాకాసి తండా వాసులు నిరాశ్రయులైన విషమం తెలిసిందే. విషయం తెలుసుకున్న 80కుటుంబాలకు ఏబీఏపీ సభ్యులు హన్మకొండ, మేడ్చల్ జిల్లా సభ్యుల సహకారంతో నిత్యవసర సరుకులు, వస్త్రాలు, టవల్స్, దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బేతి తిరుమల్‌రావు, సిరిసేటి రాజేశ్‌గౌడ్, పుల్లంరాజు, నల్ల గురువయ్య, శెట్టి భాస్కర్, నాగేశ్, వెంకగాళ్ళ సాయిలు, బయన సంతోష్, మల్లేష్, బాలరాజు, అజయ్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

● **మోమిన్‌పేట్:** మండలంలోని ఎన్కతల గ్రామ శివారులో గల మంగలి గడ్డ వైపు వెళ్లేందుకు నక్షబాట మార్గం కబ్జాకు గురి కావడంతో పానాది రోడ్డు ఇరుకుగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో రైతులు తమ సొంత ఖర్చుతో జేసీబీ సాయంతో మట్టిని తీసి రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు.

● **నవాబుపేట:** ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని మాలమహానాడు నాయకులు శివరాజ్, గాలయ్య, రాజు, యాదయ్య, సురేశ్ కోరారు. ఎల్లకొండ, నారేగూడ గ్రామాలకు చెందిన మాలమహానాడు నాయకులు బుధవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌కు చేరుకొని అధికారులకు వినతి పత్రం అందజేశారు.

● **ధారూరు:** భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.20వేలు పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. షైలారంలో బుధవారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుదర్శన్, హరికృష్ణ, భాస్కర్, మాణిక్యం, ప్రశాంత్, బాలరాజ్, అశోక్ పాల్గొన్నారు.

● **పరిగి:** ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కాళ్ళాపూర్ పాఠశాల హెచ్‌ఎం టి.వెంకటయ్య సంతాప సభను బుధవారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల నోడల్‌అధికారి గోపాల్, కాంప్లెక్స్ చైర్మన్ ఫీలిప్స్‌లు వెంకటయ్య సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, బుగ్గయ్య, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

● **మర్పల్లి:** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శేఖర్‌గుప్త అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ బుధవారం పరామర్శించారు. అదే విధంగా గత 15 రోజుల కిందట మండల కేంద్రానికి కాంగ్రెస్ నాయకుడు మధుకర్ తల్లి సావిత్రమ్మ మృతి చెందడంతో కుటుంబాన్ని, వీరశెట్టి తల్లి ప్రమీలమ్మ మృతి చెందడంతో కుటుంబాన్ని, నెలరోజుల కిందట పట్లూర్ గ్రామ సమీపంలో రోడ్డుప్రమాదంలో ఇబ్రహీం మృతిచెందగా బాధితకుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు రాములుయాదవ్, నాగేశ్, రామేశ్వర్, చంద్రన్న ఉన్నారు.

● **బంట్వారం(కోట్‌పల్లి):** కోట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన కావలి రామయ్య అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందగా బాధిత కుటుంబాన్ని కోట్‌పల్లి మాజీ సర్పంచ్ నక్కల విజయలక్ష్మి పరామర్శించి రూ.3వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆమె వెంట మాజీ మత్స్యశాఖ సంఘం అధ్యక్షుడు బందయ్య తదితరులు ఉన్నారు.

● **దోమ:** కోటి మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షనీయమని రజక సంఘం వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● **మేడ్చల్ టౌన్:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పలు విభాగాల్లో ఉత్తమ అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న వారికి బుధవారం కళాశాల యాజమాన్యం కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్(సీఎస్‌సీ) అవార్డులను ప్రదానం చేసింది. జాతీయస్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎ.శ్రీనివాసులరెడ్డి, బోధనలో శ్రేష్టమైన ఉత్తమ ఉపాధ్యాయుడిగా డాక్టర్ ఎం.కుమారస్వామి, పరిశోధన సహకారంలో డాక్టర్ శ్యాంసుందర్, విద్యార్థుల విజయానికి అత్యుత్తమ సేవలందించిన డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్, ఇన్నోవేషన్ డెవలప్‌మెంట్ కోసం ప్రత్యేకంగా కృషి చేసి డాక్టర్ ఎస్.రామకిషోర్, స్టూడెంట్ ఎంగేజ్‌మెంట్‌లో ఎక్సలెన్స్ అవార్డును డాక్టర్ ఏ.ప్రమోద్‌కుమార్‌కు కళాశాల వైస్‌చైర్మన్ సి.భూపాల్‌రెడ్డి, కార్యదర్శి శ్రీశైలంరెడ్డి చేతులమీదుగా అందజేశారు.

● **బొంరాస్‌పేట్:** మత్స్య సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయనున్నట్లు జిల్లా అధికారి ఎం.వెంకయ్య అన్నారు. దుద్యాల మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య జిల్లా అధికారి వెంకయ్యను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

● **శామీర్‌పేట:** ప్రభుత్వ జగద్గిర్‌గుట్ట గురుకుల డిగ్రీ, పీజీ మహిళ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్‌కు ఈసారి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా బుధవారం కళాశాల్లో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన, అధ్యాపకులు, విద్యార్థులు ఇష్రత్‌ను సన్మానించారు.

విలీన గ్రామాల్లో పురపాలన

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 11: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో గౌడవెల్లి గ్రామాన్ని విలీనం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన అధికారిక ఉత్తర్వుల మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ అజ్మీరస్వామి నాయక్ గ్రామపాలన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం రికార్డులను, ఇతర పరికరాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రస్తుతం పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది యథావిధిగా తమ విధులు నిర్వహించాలని కమిషనర్ సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ శాలువా కప్పి సన్మానించారు.

శామీర్‌పేట: మండలంలో మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న శామీర్‌పేట, బాబాగూడ, బొమ్మరాసిపేట గ్రామ పంచాయతీలను తాజాగా మంగళవారం ప్రభుత్వం తూంకుంట మున్సిపాల్టీలో విలీనం చేసింది. దీంతో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మంగళవారం శామీర్‌పేట, బాబాగూడ, బొమ్మరాసిపేట గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోకి తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ పంచాయతీ రికార్డులను ఆధీనంలోకి తీసుకొని సంబంధిత పంచాయతీ కార్యదర్శుల నుంచి మున్సిపల్ పరిధిలోకి చార్జీ తీసుకుని మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలను చేపట్టారు. ఇదిలా ఉండగా,తూంకుంట మున్సిపల్‌లో విలీనం చేయడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు, వివిధ పార్టీల నాయకులు వ్యతిరేకిస్తూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీల విలీనంతో మున్సిపాలిటీలపై ఆర్థిక భారం

కీసర రూరల్, సెప్టెంబరు 11: విలీనమైన పంచాయతీల కలయికతో మున్సిపాలిటీలపై ఆర్థిక భారం పడుతుందని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగారం మున్సిపాలిటీలో పంచాయతీల విలీనం అనాలోచిత చర్యగా అభివర్ణించారు. మున్సిపాలిటీ ఇప్పటికే నిధులలేమి, ఉద్యోగుల కొరతతో కొట్టుమిట్టాడుతుందన్నారు. గతంలో మున్సిపాలిటీకి టీడీల రూపేణ, పట్టణ ప్రగతి ద్వారా ప్రభుత్వం నిధులు మంజూరు చేసేందని గుర్తుచేశారు. కాగా గత ప్రభుత్వం టీడీ నిధులకు మంగళం పాడిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం పట్టణ ప్రగతి నిధులకు ఎసరు పెట్టిందని విమర్శించారు. నిధులు లేక కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేని స్థితిలో ఉన్న పంచాయతీలను మున్సిపాలిటీల్లో కలపటంతో మున్సిపాలిటీల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారే దుస్థితి నెలకొందన్నారు. తక్కువ వేతనానికి పనిచేస్తున్న పంచాయతీ కార్మికులకు విలీనం తర్వాత మున్సిపల్ చట్టం ప్రకారం జీతాలు చెల్లించాలంటే లక్షల్లో భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పురపాలికల్లో కలిపి వారిపై పన్నుల భారం మోపే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. పంచాయతీల విలీనాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఈచర్యను ప్రభుత్వం పునరాలోచించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 11: పట్టణంలోని మెయిన్‌రోడ్డులోని ప్రభుత్వ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తున్నారని తక్షణమే చర్యలు తీసుకోవాలని మాజీ పంచాయతీ సభ్యుడు మీసాల సుధాకర్‌రావు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఘట్‌కేసర్‌లోని మెయిన్‌రోడ్డులోని సర్వేనెంబర్ 484లోని 400ల చదరపు గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండానే భవన నిర్మాణం చేపట్టారని ఫిర్యాదులో వివరించారు. ఎంతో విలువైన కమర్షియల్ స్థలంలో యథేచ్ఛగా రాత్రీపగలు తేడా లేకుండా నిరంతరం నిర్మాణ పనులు జరుగుతున్నా సంబంధిత మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంలో అంతర్యమేంటని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి లక్షల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఆయన కోరారు.

విద్యార్థుల సమయానుకూలంగా బస్సులు నడపాలి



కిక్కిరిసిన బస్సు ఎక్కేందుకు విద్యార్థుల పాట్లు

నవాబుపేట, సెప్టెంబరు 11: వికారాబాద్ నుంచి శంకరపల్లి వైపు నడిచే బస్సులు సమయానుకూలంగా రావడం లేదని నవాబుపేట మండల ప్రజలు, విద్యార్థులు వాపోయారు. వికారాబాద్ నుంచి ఏక్‌మామిడి, నాగిరెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి, ఎల్లకొండ, మాదిరెడ్డిపల్లి, మైతాప్‌ఖాన్‌గూడ గ్రామాల మీదుగా శంకర్‌పల్లికి విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు ప్రతీ రోజు రాకపోకలు సాగిస్తుంటారు. బస్సులు సమయానికి రాకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.